భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు

కావలి (జలదంకి): కావలి పట్టణంలో హనుమజ్జయంతి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. మద్దూరుపాడులోని వీరాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం 6 గంటలకు పంచామృతాభిషేకం, 8 గంటలకు ఆంజనేయస్వామి మూలమంత్రంతో విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారిని 5,116 వడలతో ప్రత్యేకంగా అలంకరించారు. 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం పుష్పయాగం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని ఒంటె వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఆంజనేయస్వామిని కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

జలదంకి: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. హనుమకొండపాళెంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఉదయం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉభయకర్తలు సానా బాలకృష్ణారెడ్డి, కిష్టాపాటి లోకేష్‌రెడ్డి, పిచ్చిపాటి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో లక్ష తమలపాకుల పూజ జరిపారు.అనంతరం ఆంజనేయస్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవరప్పాడులోని ఆంజనేయస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు, పూజలు, కల్యాణోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా చేవూరు జనార్దన్‌రెడ్డి,సులోచనమ్మ దంపతులు వ్యవహరించారు. జలదంకిలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆకుపూజ, హోమం, గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా రామాల చెంచురెడ్డి, దండా అనిల్‌కుమార్‌రెడ్డి వ్యవహరించారు.

దుత్తలూరు: మండలంలోని వెంకటంపేటలోని వీరాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం హనుమజ్జయంతి సందర్భంగా విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొని ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నందిపాడులోని అభయాంజనేయస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఎంపీడీఓ హనుమంతరావు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. దుత్తలూరులోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.



ఆత్మకూరురూరల్: అభయాంజనేయస్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొండాపురం: మండలంలోని కొమ్మి, మర్రిగుంట, భీమవరప్పాడు, సాయిపేట, తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఆంజనేయస్వామికి పాలాభిషేకం, విశేషాలంకరణ, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. మర్రిగుంటలో సర్పంచ్ దార్ల గోపి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. కొమ్మి బస్టాండ్ సెంటర్‌లోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద విశేష పూజలు, హోమాలు నిర్వహించారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం కాటేపల్లి బీసీకాలనీ కూడలిలోని హనుమాన్ విగ్రహం వద్ద హనుమజ్జయంతి వేడుకలను విజయవాడకు చెందిన ఎమ్మెస్సార్ డెవలపర్స్ అధినేత ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హనుమాన్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీనివాసరావు దంపతులు యజ్ఞం నిర్వహించారు. భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు. అలాగే చాకలికొండ, బత్తినవారిపల్లి, వింజమూరులోని యర్రబల్లిపాళెం, తదితర ప్రాంతాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

ఉదయగిరి: ఉదయగిరి నుంచి దుర్గంపల్లె వెళ్లే మార్గంలో హనుమంతుని వాగు సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని ఆంజనేయస్వామినిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దుర్గంపై ఉన్న నీటి తొట్టి, కోన కాలువను నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కోన కాలువ నీటిని రుచి చూశారు. పీఆర్ డీఈ మణికుమార్, ఏఈ శ్రీనివాసరాజు, నాయకులు పాల్గొన్నారు.

కలిగిరి: మండలంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలిగిరిలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలోని అంజనేయస్వామి ఆలయం, ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం, జిర్రావారిపాళెంలోని అభయాంజనేయస్వామి విగ్రహం, కమ్మవారిపాళెంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

సీతారామపురం: మండలంలోని మారంరెడ్డిపల్లిలో అభయాంజనేయుడికి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామదేవత అంకాళమ్మ ఆలయం వద్ద నైవేద్యం, రాత్రి అభయాంజనేయస్వామికి ఆకుపూజ, గ్రామోత్సవం జరిపారు.

ఉదయగిరి రూరల్: మండలంలోని గండిపాళెం, యర్రబల్లిగడ్డలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకాలు, విశేషాలంకరణ, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



దుత్తలూరు: వెంకటంపేటలోని వీరాంజనేయస్వామిని దర్శించుకున్న మేకపాటి

వైభవంగా అభయాంజనేయస్వామి కల్యాణోత్సవం

ఆత్మకూరురూరల్: పట్టణంలోని పంటవీధి రామాలయం, కాశీనాయన ఆశ్రమం, బైపాస్‌రోడ్డులోని ఆంజనేయస్వామి మందిరాల్లో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బైపాస్‌రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ఉదయం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అభయాంజనేయస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఏటూరు సుధాకర్‌రెడ్డి, తీర్థకుమారి, అశోక్‌రెడ్డి, శ్రీలత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆంజనేయస్వామిని ఆత్మకూరు సీఐ గంగాధర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మండలంలోని కరటంపాడు, మురగళ్ల, మహిమలూరు, దేపూరు, గండ్లవేడు, తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

సోమశిల: అనంతసాగరం మండలం ఉప్పలపాడులోని కోదండరామస్వామి ఆలయం, రేవూరు, వెంగంపల్లి, అనంతసాగరం, మంచాలపల్లి తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉప్పలపాడులో గ్రామపెద్దలు ఉరుబిండి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతమ్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

సంగం: స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. దువ్వూరులోని ఆంజనేయస్వామి ఆలయంలో పూలంగి సేవ, విఘ్నేశ్వర పూజ, కలశస్థాపన, ఆంజనేయునికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, పూజలు హోమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చింతం గోవిందరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే గాంధీజనసంఘం, సిద్దీపురం గ్రామాల్లోనూ హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు.

మర్రిపాడు: చుంచులూరులోని అభయాంజనేయస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.



మర్రిపాడు: చుంచులూరు గ్రామంలో..



కొండాపురం మండలం మర్రిగుంటలో..



మద్దూరుపాడులోని వీరాంజనేయస్వామికి 5,116 వడలతో అలంకరణ



సీతారామపురంలో పూజలు చేస్తున్న భక్తులు



సంగంలో భక్తులకు అన్నప్రసాద వితరణ

క్లుప్తంగా

డీసీపల్లిలో 362 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం 362 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలానికి 486 బేళ్లు రాగా, 362 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.200, సగటున రూ.242.29 ధర పలికిందని వివరించారు. వేలంలో తొమ్మిది కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

కిలో పొగాకు గరిష్ఠ ధర రూ. 280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం కిలో పొగాకుకు గరిష్ఠ ధర రూ.280 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 511బేళ్లను వేలానికి తీసుకురాగా, 427 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ. 280, కనిష్ఠంగా రూ.200, సరాసరిన రూ. 251.19 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి టీ ఇషాక్ స్వర్ణదత్ తెలిపారు.

ఆర్థిక సాయం



ఉదయగిరి రూరల్: మండలంలోని గండిపాళెనికి చెందిన పులి లాబాను కుమార్తె సువర్ణ వివాహ ఖర్చులకు జీఎంకే ట్రస్ట్ అధినేత, వైఎస్‌ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి రూ.5 వేలు నగదు సాయాన్ని తన ట్రస్ట్ సభ్యుల ద్వారా గురువారం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు బుడంగుంట్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన



సంగం: మండల కేంద్రమైన సంగంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలచంద్ర మాట్లాడుతూ సౌర విద్యుత్‌ను ప్రతిఇంటికి చేరువ చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ పథకం కింద ఇళ్లపై సౌరఫలకలు ఏర్పాటు చేసుకునే వారికి రాయితీని అందజేస్తోందని వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుచ్చిరెడ్డిపాళెం ఏడీఏ సతీష్, సంగం ఏఈ ఉడత మన్మథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేదపండితులు

కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెంలోని కోదండరామస్వామి ఆలయంలో నూతన హనుమాన్ పంచలోహ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. గ్రామ పొలిమేర నుంచి హనుమాన్ పంచలోహ విగ్రహాన్ని ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చారు. వేదపండితులు గుంటూరు కృష్ణమూర్తిస్వామి, శ్రీధర్‌స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

సీబీఆర్ నుంచి సాగునీరు విడుదల

జలదంకి: మండలంలోని చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి దిగువకు కావలి కాలువ ద్వారా సాగునీటిని గురువారం విడుదల చేశారు. సోమశిల ప్రాజెక్టు వైస్‌చైర్మన్ పులగుంట మధురెడ్డి అధికారులతో కలిసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మధురెడ్డి మాట్లాడుతూ బ్రాహ్మణక్రాక, గౌరవరం మేజర్లతో పాటు పలు చెరువులకు సాగునీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కావలి కాలువ డీఈ శరత్‌కుమార్, ఏఈ నాగార్జునరెడ్డి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, చెరువుల అధ్యక్షులు పాల్గొన్నారు.

టీడీపీ మినీమహానాడు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు కార్యక్రమాన్ని పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరి ధనుంజయరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు దావా పెంచల రావు, పట్టణాధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ వేలూరు కేశవచౌదరి, మున్సిపల్ చైర్మన్ వెంకట రమణమ్మ, ఏఎంసీ చైర్మన్ అరికట్ల జనార్దన్‌నాయుడు పాల్గొన్నారు.

అట్టపెట్టెలు తెరిచేదెప్పుడో.. మందులు ఇచ్చేదెప్పుడో..?

దుత్తలూరు: మండల కేంద్రమైన దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మందుల కొరత, రక్తపరీక్షల కిట్ల కొరత వేధిస్తోంది. గత కొద్దినెలలుగా పీహెచ్‌సీలో పలు రకాల మందులు లేక రోగులు బయట కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల మందులు సరఫరా చేసే వాహనం వచ్చినప్పటికీ జాతీయ రహదారి నిర్మాణంతో పీహెచ్‌సీలోకి వెళ్లే వీల్లేక మందులు దింపకుండానే వెళ్లిపోయింది. ఆ తర్వాత కొన్ని రకాల మందులను సరఫరా చేశారు. అయితే వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా అట్టపెట్టెలను తెరవకుండానే మందులు లేవంటూ కొందరికి, రేపుమాపు అంటూ మరికొందరు రోగులకు సమాధానమిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. పీహెచ్‌సీలను పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు సైతం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పీహెచ్‌సీలో వైద్యసేవలు అందించడం, మందులు అందజేయడం గగనమైపోయింది. ఉన్నతాధికారులు స్పందించి రోగులకు అన్ని రకాల మందులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు రక్తపరీక్షల కిట్లను వెంటనే వైద్యశాలకు సరఫరా చేయాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు.



అట్టపెట్టెల్లో మగ్గుతున్న మందులు

ఏడు మద్యం సీసాలు స్వాధీనం

ఉదయగిరి: దుత్తలూరు మండలం వెంకటంపేటలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై ఉదయగిరి ఎక్సైజ్ ఎస్సై దీప్తికరంత్ గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బెల్టుషాపు నిర్వాహకుడ్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం



ఆత్మకూరురూరల్: మండలంలోని బంట్లపల్లిలోని కోదండరామాలయంలో సీతారాముల ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. రామస్వామిపల్లి మాజీ సర్పంచ్ యర్రంరెడ్డి నాగమోహన్‌రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించి తాళిబొట్టు, పట్టువస్త్రాలు సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం పారువేట ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ

సోమశిల: అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి గ్రామంలోని పోలేరమ్మ ఆలయంలో బుధవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయ గ్రిల్స్ తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు గర్భగుడిలోని హుండీని అపహరించుకెళ్లారు. హుండీలో సుమారు రూ.5వేల వరకు నగదు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. చోరీపై అనంతసాగరం పోలీసులకు ఆలయ నిర్వాహకులు గురువారం ఫిర్యాదు చేశారు. ఆత్మకూరు–సోమశిల ప్రధాన రహదారిపై ఉన్న పోలేరమ్మ ఆలయంలో గతంలోనూ దొంగలు చోరీకి పాల్పడ్డారు. మండలంలోని గ్రామదేవతల ఆలయాలను లక్ష్యంగా చేసుకుని దొంగలు తరచూ చోరీలకు పాల్పడుతుండడంతో గ్రామస్తులు హడలిపోతున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో నిఘా పెడితే దొంగల ముఠా కొంత మేర భయపడుతుందని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై ర్యాలీ

జలదంకి: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ను విజయవంతం చేసిన జవాన్లకు మద్దతుగా జలదంకిలో గురువారం తిరంగా యాత్ర చేపట్టారు. బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో గట్టుపల్లి రోడ్డు సెంటర్ నుంచి జలదంకి బస్టాండ్ మీదుగా సచివాలయం రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు, యువత, మహిళలు పాల్గొని జయహో భారత్, భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. జలదంకి ఎస్సై లతీఫున్నీసా, యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు ముడి కిషోర్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు చల్లా హనుమారెడ్డి, ఎంపీటీసీ మాధవరావు, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు వంటేరు రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.



కొత్త రేషన్‌కార్డుల కోసం తప్పని తిప్పలు

కొత్త కార్డుల జారీకి హౌస్ మ్యాపింగ్ కీలకం

- దాని ఆధారంగానే దరఖాస్తుల స్వీకరణ
- కొత్తదంపతులకు మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి
- బయోమెట్రిక్స్ పడితేనే దరఖాస్తు ఆన్‌లైన్
- మొరాయిస్తున్న సర్వర్
- సచివాలయాల చుట్టూ దరఖాస్తుదారుల ప్రదక్షణలు



దుత్తలూరు సచివాలయంలో రేషన్‌కార్డుల దరఖాస్తునకు వేచి ఉన్న ప్రజలు

దుత్తలూరు: కొత్తరేషన్ కార్డుల మంజూరుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో అర్హులైన వారిలో నెలకొన్న ఆనందం కాస్తా ఆన్‌లైన్ కష్టాలతో ఆవిరైపోతోంది. రేషన్‌కార్డు దరఖాస్తునకు పెట్టిన నిబంధనలతో ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. కుటుంబ సభ్యుల మ్యాపింగ్ ఒకే చోట జరగకుంటే వారి దరఖాస్తులు ఆన్‌లైన్ కావడంలేదు. కొత్తదంపతులకు మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి చేయడంతో అది ఎలా తెచ్చుకోవాలో తెలియక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ సర్టిఫికెట్ కోసం ఎప్పుడో పెళ్లి చేసుకున్న వాళ్లు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళితే రూ.3 వేల నుంచి రూ.5వేలు ఖర్చు అవుతుండడంతో లబోదిబోమని వాపోతున్నారు. రేషన్ కార్డుల్లో పిల్లల చేర్పు, తొలగింపులో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు బయోమెట్రిక్ పడకుంటే దరఖాస్తు ఆన్‌లైన్ కావడం లేదు. దీంతో బయోమెట్రిక్ పడకపోతే పరిస్థితి ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు తీసుకునే విధానంలో కొన్ని నిబంధనలను సడలించాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు ఇలా..

కూటమి ప్రభుత్వం నూతన రేషన్ కార్డుల జారీ, విభజన, కొత్తగా కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామా మార్పులకు దరఖాస్తుల స్వీకరణతో పాటు ఇప్పటికే రైస్‌కార్డులు కలిగి ఉండి వాటిని ప్రభుత్వానికి సరెండర్ చేయాలనుకునే వారికి అవకాశాన్ని కల్పించింది. జిల్లా వ్యాప్తంగా అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో కొన్ని రోజులుగా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అయితే దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో విధించిన నిబంధనలు ఇప్పుడు కొత్త కష్టాలు తెచ్చిపెట్టాయి. అన్ని సరిచూసుకుని అప్‌లోడ్ చేసే సమయానికి సర్వర్లు పనిచేయడం లేదు. దీంతో మూడు, నాలుగుసార్లు సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. కార్డుల దరఖాస్తునకు ఇన్ని నిబంధనలు ఉంటే ఎలాగని పలువురు వాపోతున్నారు.

మ్యాపింగ్‌తో తీవ్ర ఇబ్బంది

రేషన్‌కార్డుకు వివాహమై పిల్లలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలంటే అందరూ ఒకేచోట ఉన్నట్లు హౌస్‌మ్యాపింగ్ ఉండాలి. తల్లిదండ్రులు, వారి పిల్లలు ఒకే కుటుంబం అయినప్పటికీ మ్యాపింగ్‌లో ఒకేచోట లేకపోతే దరఖాస్తు స్వీకరణ సమయంలో ఆన్‌లైన్ కావడం లేదు. గతంలో చేసిన తప్పిదాలు ఇప్పుడు రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు శాపంగా మారాయి. మ్యాపింగ్‌లో మార్పులు, చేర్పులు, ఎడిట్ చేసే అవకాశాన్ని ఇవ్వకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యను పరిష్కరించకపోతే కొత్త రేషన్‌కార్డులు పొందే అవకాశాన్ని కోల్పోతారు.

విభజనలో కొత్త కష్టాలు

తల్లిదండ్రులతో కలిసి ఉన్న కొడుకులు, కుమార్తెలకు వివాహమై కొత్త కార్డులు పొందేందుకు విభజన అవకాశాన్ని కల్పించిన ప్రభుత్వం దానిని ఒక్కరికే పరిమితం చేసింది. ఇద్దరు పిల్లలు ఉండి, వారికి వివాహమైతే అందులో ఒక్కరికే విభజన అవకాశం కల్పించడంతో రెండో వారికి దరఖాస్తు చేసుకునే వీల్లేకుండాపోయింది.

ఆధార్ చిరునామాతోనే..

ఆధార్ కార్డులో ఉన్న చిరునామానే దరఖాస్తు స్వీకరణ సమయంలో పరిగణనలోకి తీసుకుంటున్నారు. చిరునామా మార్పునకు అవకాశం ఇవ్వకపోవడంతో పాత చిరునామాలతోనే దరఖాస్తు చేస్తున్నారు. వివాహమైన తర్వాత ఆధార్ భార్య ఇంటి పేరు మారకున్నా, భార్యాభర్తల ఇంటి పేర్లు ఒకేలా లేకున్నా ఆన్‌లైన్లో తీసుకోవడం లేదు. చదువుకున్న వారు ఉద్యోగాల కోసం ఆధార్ ఇంటి పేరు మార్చుకోవడం లేదు. అటువంటి వారికి ఇబ్బంది ఎదురవుతోంది. చిన్నారుల బాల ఆధార్ అప్డేట్ అయితే కానీ వారి పేర్లను తల్లిదండ్రుల కార్డుల్లో చేర్చడానికి అవకాశం ఉండడం లేదు. ఇప్పుడు అప్‌డేట్ చేయించాలంటే కార్డుల దరఖాస్తు గడువు ముగిసిపోతుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనికి తోడు సచివాలయాల్లో సిబ్బంది కొరత వేధిస్తుండడంతో రోజుల తరబడి దరఖాస్తుదారులు ప్రదక్షణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకవేళ సిబ్బంది ఉన్నా సర్వర్ మొరాయిస్తోంది. దీంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తునకు గడువు ఇవ్వాలని కోరుతున్నారు.

బయోమెట్రిక్స్ పడితేనే రేషన్‌కార్డు

రేషన్‌కార్డుల దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో ప్రధాన దరఖాస్తుదారుడు తప్పనిసరిగా తన బయోమెట్రిక్స్ (వేలిముద్రలు) వేయాల్సి ఉంటుంది. బయోమెట్రిక్స్ పడకుంటే దరఖాస్తు ఆన్‌లైన్ కావడం లేదు. గతంలో ఆధార్‌కు లింక్ అయిన మొబైల్‌కు ఓటీపీ వచ్చేది. దీని వల్ల బయోమెట్రిక్స్ పడని వారికి ఉపయోగకరంగా ఉండేది. ప్రస్తుతం ఓటీపీ ఆప్షన్‌ను తొలగించారని చెబుతున్నారు.

ప్రతిఇంటికి తాగునీరు అందించడమే లక్ష్యం



పంప్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

అల్లూరు: ప్రతిఇంటికి తాగునీరు అందించడమే తమ లక్ష్యమని కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. అల్లూరు సమ్మర్ స్టోరేజీ పునఃప్రారంభోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి హాజరై పంపుహౌస్ బటన్‌నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.40 లక్షలతో అల్లూరు సమ్మర్ స్టోరేజీని ఆధునీకరించి నగర పంచాయతీ పరిధిలోని ప్రజలకు తాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. మరో రూ.40 లక్షలతో అంచనాలు సిద్ధం చేసి పంపుతున్నామన్నారు. అవి విడుదలైతే అల్లూరు సమ్మర్ స్టోరేజీ నుంచి ఇస్కపల్లి, గోగులపల్లి, సింగపేట గ్రామాలకు కూడా పుష్కలంగా తాగునీటిని అందిస్తామన్నారు. జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మండంలోని పలు గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో ఇంటింటికి తాగునీరు అందిస్తామన్నారు. అల్లూరు నగర పంచాయతీని త్వరలో పంచాయతీగా మార్పు చేస్తామన్నారు. పంచాయతీగా మారిన వెంటనే జల్‌జీవన్ మిషన్‌లో పెట్టించి నిధులను మంజూరు చేయించి ప్రతిఇంటికి తాగునీరు అందిస్తామన్నారు. రైతులకు పుష్కలంగా సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రైతులు నిర్భయంగా పంటలు వేసుకోవచ్చని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాశ్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ రజనికాంత్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.